క్లుప్తంగా

దుర్గమ్మ హుండీ లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న అర్చకులు, సిబ్బంది

నర్సీపట్నం: స్థానిక కనకదుర్గ మల్లేశ్వరస్వామి ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు చేపట్టారు. 75 రోజులకు రూ.5,38,145 ఆదాయం వచ్చిందని ఈవో టి.సాంబశివరావు తెలిపారు. దేవదాయ ఇన్‌స్పెక్టర్ ఆర్.శ్రీనివాస్, అర్చకులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు పరిష్కారం

కె.కోటపాడు: రెవెన్యూ సదస్సులతో సమస్యలకు పరిష్కారం లభించనున్నట్లు డీటీ డి.రమేష్ తెలిపారు. గురువారం గవరపాలెం సదస్సులో 8 అర్జీలు స్వీకరించారు. సర్వేయర్ రామచంద్రమూర్తి, సర్పంచ్ తోట భవాని పాల్గొన్నారు.
రోలుగుంట: సర్పంచ్ బండారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ సదస్సులో డీటీ శంకర్రావు 15 వినతులను స్వీకరించారు. సర్వేయర్ రెడ్డి తవుటునాయుడు, రైతులు పాల్గొన్నారు.
నాతవరం: వల్సంపేటలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డీటీ శివ, సర్వేయరు ప్రసాద్, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ఇట్టంశెట్టి శ్రీను, తాండవ ప్రాజెక్టు నీటి సంఘం అధ్యక్షుడు మిడతాన ప్రసాద్ పాల్గొన్నారు.

ఏఎల్‌పురం గ్రామ సభ రేపు


సర్పంచ్ సుజాత

గొలుగొండ: ఏఎల్ పురం మేజర్ పంచాయతీ గ్రామ సమస్యలపై ఈ నెల 4న గ్రామసభ నిర్వహించనున్నట్లు సర్పంచ్ లోచల సుజాత గురువారం తెలిపారు. గ్రామంలో అభివృద్ధి పనులపై సలహాలు, సూచనలు ప్రజల నుంచి స్వీకరిస్తామన్నారు. కొత్తగా గ్రామంలో జరిగే పనులపై తీర్మానాలు చేస్తామన్నారు.

వెండి బహూకరణ


వెండి అందజేస్తున్న దాత సత్తిబాబు

మాడుగుల రూరల్: ఎం. కోడూరులో మోదకొండమ్మకు గ్రామానికి చెందిన మర్లోతు సత్తిబాబు, దుర్గ దంపతులు పావు కిలో వెండి బహూకరించారు. దీన్ని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు గురువారం అందజేశారు. నాయకులు గంగిరెడ్ల లింగన్న, పడాల అప్పలనాయుడు, కలిమి గోపాల్, ఎంపీటీసీ ముమ్మిన రమణబాబు, పోతిన జగదీష్ పాల్గొన్నారు.

వీధిలైట్ల ఏర్పాటు


వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

గొలుగొండ: వీధిలైట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు గొలుగొండ సర్పంచ్ కసిపల్లి బుజ్జి, పంచాయతీ కార్యదర్శి రమణ తెలిపారు. గ్రామంలో ఎస్సీ కాలనీ, వెలమ కాలనీ, తెలుకుల కాలనీ, కాపు కాలనీల్లో మరమ్మతులకు గురైన వీధి లైట్లు స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పండగ వాతావరణం దృష్ట్యా పంచాయతీలోని అన్ని ప్రాంతాల్లో వీధిలైట్లు, తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

యూటీఎఫ్ క్యాలెండర్ విడుదల


క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న ఎంఈవోలు పాండురంగారావు, దేముడమ్మ

మాడుగుల రూరల్: జిల్లా కార్యదర్శి పోలిమేర చంద్రరావు ఆధ్వర్యంలో యూటీఎఫ్ నూతన క్యాలెండర్‌ను స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవోలు పాండురంగారావు, దేముడమ్మ గురువారం విడుదల చేశారు. గౌరవాధ్యక్షుడు శరగడం జగ్గారావు, ప్రధాన కార్యదర్శి ఆడారి అప్పారావు, సత్తిబాబు, కిశోర్, రమణకుమారి, సత్యనారాయణ, రామారావు, శివ, రమణ, ఆనంద్ పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854, 7997958336
సాక్షి

మహిమల మహావృక్షం

- వనదేవతగా భాసిల్లుతున్న రావిచెట్టు
- అజ్ఞాత వాసంలో పాండవుల ఆశ్రమం
- అమ్మ కృపతో మత్స్య వంశరాజులకు విజయాలు
- ఈనాటికి చెట్టు నీడలో మాడుగుల సంత
- చెట్టు పరిరక్షణకు కృషి చేస్తున్న కోఆప్షన్ మెంబరు ఉన్నీషా


మాడుగులలో దేవతా చెట్టు


రావి చెట్టు చుట్టూ టైల్స్ వేయించి, శుభ్రం చేస్తున్న ముస్లిం మహిళ ఉన్నీషా

మాడుగుల: రాళ్లూరప్పలు, చెట్లూపుట్టలను పూజించడం అనాదిగా వస్తున్న హిందూ సంప్రదాయం.. వీటిని మరిడమ్మ, నూకాలమ్మ, పరదేశమ్మ అని పేర్లతో గ్రామదేవతలుగా పిలుచుకుని కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా పూజిస్తుంటారు. హిందువులు ఇప్పటికీ ఇదే ఆచారాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. వీరి నమ్మకాన్ని వమ్ము కానివ్వకుండా ఓ ముస్లిం మహిళ మాడుగులలో రావి మహా వృక్షం పరిరక్షణకు నడుం బిగించింది.
ఏజెన్సీకి ముఖద్వారమైన ఈ ప్రాంతంలో పాండవుల కొండ పరిసరాలలో రావి వృక్షాన్ని దేవతగా పూజిస్తుంటారు. పాండవులు అజ్ఞాతవాస కాలంలో విరాట రాజు ఇక్కడ కొలువుకు వచ్చారని, గ్రామ సమీపంలో కొండను పాండవులు కొండగా ఆనాటి నుంచి పిలుస్తుంటారు. విరాట మహారాజు మత్స్య వంశ రాజు కావడంతో 17వ శతాబ్ద కాలం వరకు ఇక్కడ మత్స్య వంశ రాజులు పాలన సాగిందని, వారు అమ్మవారిని పూజించి యుద్ధాల్లో పాల్గొంటే విజయం వరించేదని గ్రామ పెద్దలు చెబుతుంటారు. మాడుగులలో ఈనాటికి మత్స్యవంశ రాజులు నిర్మించిన కోట నాటి ఆనవాళ్లకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. పాండవులు ఈ ప్రాంతానికి వచ్చి దేవతా చెట్టు వద్దే ఆశ్రయం పొందారని చరిత్రకారులు చెబుతున్నారు. ఆనాడు పాండవులు దేవతా చెట్టును పూజించడంతో విజయం సాధించారని ప్రతీతి. మాడుగులలో శివాలయాలు లేని సమయంలో కార్తీక మాసంలో భక్తులు ఇక్కడ రావి చెట్టు వద్దనే పూజలు చేసేవారు. అదే సంప్రదాయం ఈనాటికి కొనసాగుతోంది. ఈ చెట్టుకు సమీపంలో పాండవుల కొండపై పార్థసారథి ఆలయం, అతి సమీపంలో దుర్గామల్లేశ్వరి, దేవి, మోదకొండమ్మ ఆలయాలు ఏర్పడటం వల్ల అనునిత్యం ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోంది.

రావి చెట్టు అభివృద్ధికి నడుం బిగించిన ముస్లిం మహిళ



గ్రామపెద్దలు, గ్రామస్తుల సహకారంతో అతి పురాతనమైన రావి చెట్టు విశిష్టతను మరింత ప్రాచుర్యంలోకి తేవడానికి స్థానిక కోఆప్షన్ సభ్యురాలు షేక్ ఉన్నీషా నడుంబించారు. మండల పరిషత్ నిధులతో పాటు గ్రామస్తులు సహకారంతో చెట్టు చుట్టూ దిమ్మపై టైల్స్ వేయించారు. రోజూ నీళ్లతో కడిగి శుభ్రం చేస్తున్నారు. ప్రతి సోమవారం వారపు సంతకు వచ్చే ఎంతో మంది వ్యాపారులు ఈ చెట్టు కింద చల్లని నీడలో సేద తీరుతున్నారు. మతాలు అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేసే ఈ రోజుల్లో ఓ ముస్లిం మహిళ హిందూ సంప్రదాయాలను గౌరవించుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. రానున్న కాలంలో ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా మార్పు చేయడానికి కృషి చేస్తున్నానని ఆమె చెబుతున్నారు.

దైవంగా పూజిస్తారు



గ్రామస్తులందరూ ఆలయాలు లేని సమయంలో రావి చెట్టునే దైవంగా పూజించేవారు. మహారాజుల పాలనలో మాడుగులలో 20 ఆలయాల నిర్మించారు. అంతకుముందు నుంచి ఈనాటికి రావిచెట్టునే ప్రధాన దేవతగా పూజిస్తారు. ఈ చెట్టు ఆనాటి ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా దర్శనమిస్తోంది. ఈ చెట్టు మహిమ గలదని ఈ ప్రాంత భక్తులు విశ్వాసం.
– బసవారామ పరమేష్, భక్తుడు మాడుగుల

ముషిడిపల్లిలో సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజలో ఎంపీపీ బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ సత్యం

దేవరాపల్లి: ముషిడిపల్లిలో రూ.10 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు నిర్మాణ పనులకు గురువారం ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ మతల దేముడమ్మ, ఎంపీటీసీ బొడ్డు లక్ష్మీ, వైస్ ఎంపీపీ ఉగ్రూకుల గంగాభవానీ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, ఎ. కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణలతో కలిసి ఎంపీపీ, జెడ్పీటీసీ భూమిపూజ చేశారు. నాయకులు బొడ్డు అప్పారావు, బొడ్డు నారాయణమూర్తి, మతల సాంబమూర్తి, మతల అప్పారావు, మతల వెంకునాయుడు మాస్టారు, పంచాయతీ కార్యదర్శి ఎల్. లింగన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కె.కోటపాడు: గొండుపాలెం 11 కేవీ ఫీడర్ పరిధిలోని నాలుగు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. విద్యుత్ లైన్ మెయింటెనెన్స్‌తో పాటు కండక్టర్ చార్జింగ్ పనులు నిర్వహించు నిమిత్తం ఈ అంతరాయం కలగనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గొండుపాలెం, గుల్లేపల్లి, చౌడువాడ, మల్లంపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్‌ఎంసీ చైర్మన్లకు శిక్షణ


మాట్లాడుతున్న ఎంఈవో ప్రసాద్


శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈవో జాన్‌ప్రసాద్


మట్లాడుతున్న ఎంఈవోలు

చోడవరం రూరల్: పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల చేరిక, ఉత్తీర్ణతా శాతం పెంపు పట్ల యాజమాన్య కమిటీలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవోలు తిరుపతిరావు, కె.సింహాచలం కోరారు. గురువారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మండలంలోని 61 పాఠశాలల యాజమాన్య కమిటీ చైర్మన్లు, హెచ్ఎంలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షకులుగా ట్రైనీ ఉపాధ్యాయులు కొండలరావు, గంగాధర్, రమేష్ వ్యవహరించారు. యాజమాన్య కమిటీల ఏర్పాటు, విధులు, బాధ్యతలు, బాలల హక్కులు–పరిరక్షణ, కమిటీ సమావేశాల నిర్వహణ–విధి విధానాలు, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, ప్రజల భాగస్వామ్యం, సమకాలీన సమస్యలు వాటి పరిష్కార మార్గాలు వంటి పలు అంశాల పట్ల వారికి అవగాహన కల్పించారు. సీఆర్‌పీ కె.వి.ఎం.నాయుడు, సుబ్రహ్మణ్యం, రవిశంకర్, నాగలక్ష్మి పాల్గొన్నారు.
మాకవరపాలెం: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) చైర్మన్లకు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో రిసోర్స్ పర్సన్లుగా రాము, మూర్తి, త్రినాథ్ వ్యవహరించారు. ఎంఈవో జాన్‌ప్రసాద్ పాల్గొన్నారు.
కె.కోటపాడు: ఎస్‌ఎంసీ చైర్మన్లు, హెచ్‌ఎంలు పాఠశాలల అభివృద్ధిలో పాలు పంచుకోవాలని ఎంఈవో డీవీడీ ప్రసాద్ తెలిపారు. గురువారం కె.కోటపాడులో వారికి శిక్షణ ఇచ్చారు. ఎంఈవో సత్యనారాయణ, హెచ్ఎం కమలాకుమారి పాల్గొన్నారు.

ఓబీసీ జిల్లా చైర్మన్‌గా రమణ


రాష్ట్ర చైర్మన్‌తో జిల్లా చైర్మన్ రమణ

మాకవరపాలెం: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్‌గా బొతు రమణ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర చైర్మన్ సొంటి నాగరాజు నుంచి గురువారం నియామక ఉత్తర్వులు అందుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పనిచేసిన తనకు ఓబీసీ జిల్లా చైర్మన్‌గా బాధ్యత అప్పగించిన రాష్ట్ర చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ప్రజలకు వైద్య సేవలందించాలి

మాడుగుల రూరల్: వైద్య, ఆరోగ్య సేవలను పూర్తిస్థాయిలో ప్రజలకు అందించాల్సిన బాధ్యత మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఎం.ఎల్.హెచ్.పిలకు ఉందని వైద్యాధికారి కె. లీలాప్రసాదు అన్నారు. గురువారం కె.జె.పురం పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, పీహెచ్‌సీ సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. యు.ఎ.పి, కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. అనంతరం నూతన సంవత్సర కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి ప్రసాదుపాత్రుడు, సీహెచ్‌వో సుజాత, పీహెచ్‌ఎన్ ఎం. ఇందిర పాల్గొన్నారు.

పాల రైతులకు అమూల్ ప్రోత్సాహకాలు


పాడి రైతులకు అమూల్ డెయిరీ బేసిన్లు అందజేస్తున్న సర్పంచ్ శంకరరావు

చోడవరం రూరల్: అమూల్ డెయిరీ పాడి రైతులకు తగు ప్రోత్సాహకాలను అందిస్తోంది. బెన్నవోలు పాల సేకరణ కేంద్రానికి పాలు సరఫరా చేస్తున్న పాడి రైతులకు బోనస్‌గా బిర్యానీ బేసిన్లు అందజేసింది. గ్రామ సర్పంచ్ మూడెడ్ల శంకరరావు వీటిని గురువారం పంపిణీ చేశారు. అమూల్ డెయిరీ ఇన్‌చార్జి సాయి కిరణ్ పాల్గొని తమ డెయిరీ రైతులకు లబ్ధి కలిగేలా పలు రకాల సేవలు అందిస్తున్నట్టు ఈ సందర్భంగా తెలిపారు. డెయిరీ సెంటర్ కార్యదర్శి కంఠంరెడ్డి రమాదేవి, వార్డు మెంబర్లు మొల్లి గోవింద, కంఠంరెడ్డి రామాంజనేయ, నిట్ట రమణబాబు, మజ్జి గోవింద్, మజ్జి రమణబాబు, పందూరు దేముళ్లు తదితరులు పాల్గొన్నారు.


రూ.2.10 కోట్లతో తాండవ ప్రాజెక్టు అభివృద్ధి పనులు

- ఇరిగేషన్ ఈఈ బాల సూర్యం


తాండవ ప్రాజెక్టు అభివృద్ధి పనులపై చర్చిస్తున్న ఇరిగేషన్ ఈఈ బాల సూర్యం

నాతవరం: తాండవ రిజర్వాయరు అభివృద్ధి పనులకు రూ.2.10 కోట్లు మంజూరైనట్లుగా ఇరిగేషన్ ఈఈ వి.బాల సూర్యం తెలిపారు. డీఈ అనురాధ, ప్రాజెక్టు నూత కమిటీ సభ్యులతో కలిసి ఆయన తాండవ ప్రాజెక్టును సందర్శించారు. ఇక్కడ నీటి నిల్వలతో పాటు మరమ్మతులకు గురైన గేట్లును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రాజెక్టు గేట్లు, పంట కాలువల అభివృద్ధి కోసం ప్రభుత్వం 18 పనులకు గాను నిధులు మంజూరు చేసిందన్నారు. ఐదు పనులను టెండర్ల ప్రక్రియ పూర్తి చేశామన్నారు. మిగతా పనులకు టెండర్ల ప్రక్రియ దశలో ఉందన్నారు. త్వరలోనే అన్ని పనులు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె. సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ కాశవు నూకరాజు, జేఈలు శ్యామ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, నాగబాబు పాల్గొన్నారు.

రైతులకు శ్రీరామ రైతు సంఘం చేయూత


రైతు కుటుంబానికి నగదు సహాయం అందజేస్తున్న రమణ

దేవరాపల్లి: శ్రీరామ రైతు సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కె.వి.రమణ, సంఘం అధ్యక్షుడు కొట్టాన రాము ఆధ్వర్యంలో 2004లో 15 మంది రైతులు మరణించగా, వారి కుటుంబాలకు రూ. 5 వేల చొప్పున సాయాన్ని గురువారం అందజేశారు. తొలుత నూతన సంవత్సర కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. 200 రైతు కుటుంబాలు 2009లో ఈ సంఘాన్ని ఏర్పాటు చేసి ప్రతి నెలా రూ.100 రుసుం వసూలు చేస్తున్నారు. ఈ మొత్తంలో మరణించిన రైతు కుటుంబానికి రూ. 5 వేల చొప్పున అందిస్తున్నారు.సెక్రటరీ అవతారం, ఉపాధ్యక్షుడు గవిరెడ్డి దేముడునాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి ట్రాక్టర్‌పై గడ్డి దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కె.కోటపాడు: రొంగలినాయుడుపాలెం–మేడిచర్ల గ్రామాల మధ్య గురువారం ట్రాక్టర్‌పై గడ్డికి విద్యుత్ వైర్లు తగిలి కాలిపోయింది. రొంగలినాయుడుపాలెం గ్రామానికి చెందిన రైతు కె.సింహాద్రి వరికుప్ప నూర్చి గడ్డిని ట్రాక్టర్‌పై కళ్లానికి తరలిస్తుండగా రోడ్డుపై విద్యుత్ వైర్లు తగిలి గడ్డి నుంచి మంటలు వచ్చాయి. స్థానికుల సమాచారం మేరకు చోడవరం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలార్పారు. ట్రాక్టర్‌కు ఎటువంటి నష్టం కలగలేదని అగ్నిమాపక కేంద్రం ఏఎస్ఐ ప్రసాద్ తెలిపారు. కాలిపోయిన గడ్డి విలువ రూ.15 వేలుగా ఉంటుందని అంచనా వేశారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

- అనేక కేసుల్లో సొత్తు రికవరీ
- డీఎస్పీ మోహన్



నర్సీపట్నం: గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపామని నర్సీపట్నం డీఎస్పీ మోహన్ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. గతేడాది గంజాయి అక్రమ రవాణాపై దాడులు నిర్వహించి పోలీసు సబ్ డివిజన్ పరిధిలో 62 కేసులు నమోదు చేశాం. ఈ కేసుల్లో 179 మందిని అరెస్టు చేసి, 1,883 కేజీల గంజాయిని రూ.11,17,120 నగదును సీజ్ చేశాం. పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించి 140 కేసులు నమోదు చేసి, 667 మందిని అరెస్టు చేసి, రూ.13,49,329 సీజ్ చేశాం. కోడిపందాల స్థావరాలపై దాడులు నిర్వహించి 101 కేసులు నమోదు చేసి, 293 మందిని అరెస్టు చేసి, రూ.1,08,063 నగదును సీజ్ చేశాం. హెల్మెట్, సీటు బెల్టు వారిపై ట్రిపుల్ రైడింగ్, ఓవర్ లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తదితర రోడ్డు భద్రతా ఉల్లంఘనదారులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం 15,025 కేసులు నమోదు చేశాం. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై 893 కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి వారిపై 3,226 కేసులు నమోదు చేశాం. మాదక ద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాలు, మహిళా రక్షణ చట్టాలు, భద్రత, రోడ్డు సేఫ్టీ తదితర అంశాలపై డివిజన్ వ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. ఎస్పీ ఆదేశాలతో రాత్రి వేళ డివిజన్‌లో కొనసాగుతున్న గస్తీ ఏర్పాటు చేశాం. ఏటీఎం కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాం. గతేడాది సబ్ డివిజన్ పరిధిలో సుమారు 989 ఐపీసీ, బీఎన్ఎస్ కేసులు నమోదైనవని, వాటిలో పెద్ద నేరాలు 7 హత్యలు, 2 సొత్తు కోసం హత్యలు, ఒకటి రోబరీ, 13 మానభంగ కేసులు, 14 ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేశాం. ముఖ్యంగా మాకవరపాలెం పోలీసు స్టేషన్‌లో నమోదైన 2 సొత్తు హత్యలలో చాకచక్యంగా దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశాం. అతని నుంచి రూ.2.75 లక్షలు రికవరీ చేశాం. పాయకరావుపేట పోలీసు స్టేషన్‌లో నమోదు కాబడిన రోబరీ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రూ.3.20 లక్షలు రికవరీ చేశామని తెలిపారు.

ప్రతి రైతూ మద్దతు ధర పొందాలి

- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

నర్సీపట్నం: ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతి రైతు కనీస మద్దతు ధర పొందేలా చూడాల్సిన బాధ్యత రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జులపై ఉందని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు పేర్కొన్నారు. గురువారం ఏడీ కార్యాలయంలో రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జులతో ఆయన సమీక్షించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. బహిరంగ మార్కెట్‌లో ధాన్యం అమ్ముకునే రైతుల వివరాలను నమోదు చేయాలన్నారు. రబీ ఈ– పంట నమోదు వేగవంతం చేయాలన్నారు. కౌలు రైతుల వివరాలను బ్యాంకులతో సంప్రదించి అర్హత ఉన్న వారికి పంట రుణాలు అందించాలని ఆదేశించారు. పీఎం కిసాన్ లబ్ధిదారుల వివరాలను వెరిఫికేషన్ చేసి పోర్టల్‌లో సమయానికి నమోదు చేయాలని సూచించారు. ఏడీ టి.శ్రీదేవి, నర్సీపట్నం, గొలుగొండ, రోలుగుంట వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో అవకతవకల ఫిర్యాదుపై విచారణ


లబ్ధిదారులను విచారణ చేస్తున్న ప్రత్యేకాధికారి

మాకవరపాలెం: పింఛన్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా నమోదైన ఫిర్యాదులపై అధికారులు విచారణ చేపట్టారు. మండల వ్యాప్తంగా 27 మంది నుంచి పింఛన్ల నగదు పంపిణీ సమయంలో నగదు తీసుకున్నట్టు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఆ ఫోన్ నంబర్లు, లబ్ధిదారుల వివరాల ఆధారంగా గురువారం మండల ప్రత్యేకాధికారి రామ్మోహన్‌రావు, ఎంపీడీవో సీతామహాలక్ష్మి విచారణ చేశారు. ఐవీఆర్ఎస్ కాల్స్ వచ్చిన ఫోన్ నంబర్లు తమ వద్ద లేవని కొందరు, తాము ఎవరికీ నగదు ఇవ్వలేదని, ఫిర్యాదులు చేయలేదని లబ్ధిదారులు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ప్రత్యేకాధికారి తెలిపారు.

5న బహుజన గర్జనను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న బహుజన రక్షణ పోరాట సమితి పెద్దలు నర్సింగరావు యాదవ్

నర్సీపట్నం: ఈ నెల 5న నిర్వహించే బహుజన గర్జనను విజయవంతం చేయాలని బహుజన రక్షణ పోరాట సమితి పెద్దలు ఒమ్మి నరసింగరావు యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇటీవల పట్టణంలోని కొత్తవీధిలో సర్వసుద్ధి నాగేశ్వరరావు హత్యను నిరసిస్తూ శ్రీకన్య కూడలి నుంచి అబిద్‌సెంటర్ వరకు శాంతియుత ర్యాలీ చేపట్టి, సిటీ క్లబ్ ఆవరణలో సమావేశం నిర్వహిస్తామన్నారు. దీనికి భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్రరావు యాదవ్, ఉమ్మడి జిల్లాలోని యాదవ సంఘ ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. పిల్లా వెంకటేశ్వరరావు యాదవ్, ఒమ్మి నూకరాజు, పల్లా కృష్ణ, రాజుబాబు, బీసీవై పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జోగా చంద్రమౌళి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రవాణా రంగం సమస్యలపై 5న జిల్లా సదస్సు


ఆటో కార్మికులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు రాజు, చిరంజీవి

నర్సీపట్నం: రవాణా రంగం సమస్యలపై ఈ నెల 5న అనకాపల్లిలో ఏర్పాటు చేసిన జిల్లా సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు కోరారు. ఆటో యూనియన్ ప్రతినిధులతో కలిసి జిల్లా సదస్సు కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల మోటారు కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అధికారంలోకి వస్తే ఆటో, మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పిందన్నారు. ఆటో కొనుగోలుకు బ్యాంకు సబ్సిడీతో రూ.4 లక్షల రుణాలు మంజూరు చేస్తామని, ప్రతి ఆటో డ్రైవర్‌కు వాహన మిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని, జీవో నంబరు 21 రద్దు చేస్తామని చెప్పి అమలు చేయకుండా లైసెన్సు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇచ్చే విధానాన్ని ప్రైవేటుపరం చేస్తుందని దుయ్యబట్టారు. సీఐటీయూ నాయకుడు ఈరెల్లి చిరంజీవి, ఆటో యూనియన్ రెడ్డి శ్రీను, రాంబాబు, అప్పారావు, చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగలో విత్తన శుద్ధి తప్పనిసరి

- కేవీకే ప్రధాన శాస్త్రవేత్తలు


కాశీపురంలో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, సౌజన్య, ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: వేరుశనగను సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలు కె. రాజ్‌కుమార్, సౌజన్య సూచించారు. పొలం పిలుస్తోందిలో భాగంగా గురువారం కాశీపురంలో ఏవో వై. కాంతమ్మ ఆధ్వర్యంలో నూనె గింజలలో సామూహిక ప్రదర్శన క్షేత్రం నిర్వహించారు. వేరుశనగ గింజలను మాంకోజబ్, కార్బన్‌డజిం మందుతో విత్తన శుద్ధి చేయాలని ప్రయోగాత్మకంగా వివరించారు. విత్తన శుద్ధితో పంటకు చీడపీడల బెడద నుంచి రక్షించుకోవచ్చని, దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. వేరుశనగ వేసిన 40 రోజుల తర్వాత ఏపుగా ఎదిగేందుకు దోహదపడే సూక్ష్మపోషకాలు కల్గిన మల్టీ కె మందలను రైతులకు ఉచితంగా అందజేశారు. సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, తమటపు శెంబునాయుడు పాల్గొన్నారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి



కె.జె.పురం గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ జామి రమణబాబు


వారాడ గ్రామసభలో సర్పంచ్, తదితరులు

మాడుగుల రూరల్/కె.కోటపాడు: గ్రామ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కె.జె.పురం, వారాడ సర్పంచులు జామి రమణబాబు, గొర్రుపోటు సౌజన్య తెలిపారు. కె.జె.పురం, వారాడ సచివాలయాల వద్ద గురువారం ఉదయం గ్రామ సభలు నిర్వహించారు. శాఖలు వారీగా సిబ్బందితో సమీక్షించారు. కె.జె.పురం ప్రగతి నివేదికను పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి ప్రవీణ్ చదివి వినిపించారు. ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావు, చిన్నం లోవతల్లి పాల్గొన్నారు. వారాడ పంచాయతీ కార్యదర్శి సరోజిని మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్నులను మార్చి 31లోగా చెల్లించాలన్నారు. వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి, ఉప సర్పంచ్ చిరికి గోవింద, గొర్రుపోటు వెంకటరావు, లెక్కల గోపి పాల్గొన్నారు.